శిథిలమై.. ప్రమాదాలకు నిలయమై..

- మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులు
- యూజీడీలు, కాలువలపై ధ్వంసమైన పలకలు
- రాకపోకల సమయంలో భయాందోళనలు
- ప్రజల ఇబ్బందులను పట్టించుకోని అధికారులు


వర్మా కాంప్లెక్స్ ప్రాంతంలో శిథిలమైన కాలువ


మురళీనగర్ వాకర్స్ పార్కు రహదారిలో ప్రమాదకరంగా యూజీడీ మ్యాన్‌హోల్

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. రహదారులు, కాలువల వద్ద పొంచి **ఉన్న ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోక** పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదమని తెలిసినా అటువైపు ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు.

మరింతగా కుంగిన రహదారి

జీవీఎంసీ 49వ వార్డు మాణిక్యాంబ కాలనీ చాకలి గెడ్డకు అనుబంధంగా నిర్మించిన పాత రోడ్డు అంచుల వద్ద తాజాగా కురిసిన వర్షాలకు మరింతగా కుంగిపోయింది. సుమారు 200 మీటర్ల పొడవునా గెడ్డ అభివృద్ధిలో భాగంగా నిర్మించిన రక్షణ గోడ, **ఇరుకు రహదారికి మధ్యలో ఏర్పడిన ఖాళీ ప్రాం**తాన్ని క్రషర్ బుగ్గితో కప్పి వదిలేశారు. వర్షాల వరద నీటికి ఈ బుగ్గి కొట్టుకుపోయి ఈ ప్రాంతమంతా భారీ గొయ్యిగా తయారై ప్రమాదకరంగా మారిన విషయం తెలిసిందే. దీనికి తోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇది మరింత కుంగింది. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల నుంచి వాడుక నీరు పోయే పైపులు తేలిపోయి పాడయ్యాయి. రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు **కోరుతున్నారు.**

ఒక్కో చోట.. ఒక్కో రకంగా..

మురళీనగర్ సెక్టార్లలోని పలు ప్రాంతాల్లో శిథిలమైన భూగర్భ డ్రైనేజీల మూతలు, కాలువలు, కల్వర్టుల వద్ద పలకలు విరిగిపోయి ప్రమాదాలకు నిలయంగా మారాయి. మురళీనగర్ వాకర్స్ పార్కు అనుసంధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పైమూత పూర్తిగా శిథిలమై భూమికి దిగువకు ఒరిగిపోయి ప్రమాదకరంగా తయారైంది. వైశాఖి స్పోర్ట్స్ పార్కు, వాకర్స్ పార్కులకు వెళ్లే చిన్నారులు సైకిళ్లపై ప్రయాణించేటప్పుడు ఇందులో పడి ప్రమాదాల పాలవుతున్నారు. ఇటువైపు అధికారులు ప్రయాణిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇదే మార్గంలో వర్మ కాంప్లెక్స్‌ను రహదారిని కలిపే చోట కాలువపై అమర్చిన పలకలు శిథిలమయ్యాయి. వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల శిథిలమైన చోట చెట్టు కొమ్మను ప్రమాద సూచికగా పెట్టిన అధికారులు ఇప్పుడు విరిగిన పలకలనే ఒకచోట పేర్చి తమ పనైపోయినట్టు వదిలేశారు. దీని పక్కనే వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. భక్తులు ఏమాత్రం అశ్రద్ధ చేసినా ప్రమాదానికి గురికాక తప్పదు. ఈ ప్రాంతంలోని కాలువ పూర్తిగా శిథిలమై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.


వాకర్స్ పార్కు సమీపంలో కాలువపై విరిగిన పలకలు


మాణిక్యాంబ కాలనీలో కుంగిపోయి ప్రమాదకరంగా మారిన రహదారి


చాకలి గెడ్డ వద్ద ప్రమాదాలకు నిలయమైన భారీ గొయ్యి

క్లుప్తంగా

కణితి చిరంజీవికి కె.కె.రాజు పరామర్శ


రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిరంజీవిని పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, 54వ వార్డు అధ్యక్షుడు కణితి చిరంజీవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆదివారం 104 ఏరియా జ్యోతినగర్‌లోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. చిరంజీవి త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కె.కె.రాజు ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైస్తవుల మద్దతుతో పార్టీ బలోపేతం


జాన్‌వెస్లీని మర్యాదపూర్వకంగా కలిసిన డొమ్మేటి శామ్యూల్ సాగర్


సీతంపేట: వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీని లలితానగర్‌లోని ఆయన నివాసంలో కొత్తగా నియమితుడైన పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తాళ్లరేవు జెడ్పీటీసీ డొమ్మేటి శామ్యూల్ సాగర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను ఈ పదవిలో నియమించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చేలా కష్టపడి పనిచేస్తానన్నారు. భవిష్యత్‌లో పార్టీని క్రైస్తవుల మద్దతుతో ఏ విధంగా బలోపేతం చేయాలి, విధివిధానాలు, ప్రణాళికలు, క్రైస్తవుల సమస్యలపై చర్చించారు. తాళ్లరేవు మండలం అధ్యక్షుడు కాదా గోవింద్ కుమార్ పాల్గొన్నారు.

'ప్రతిభ' అవార్డుల ప్రదానం


ప్రతిభ అవార్డులు అందుకున్న వివిధ రంగాల ప్రముఖులు

సీతంపేట: నగరానికి చెందిన ప్రతిభ క్రీడా సాంస్కృతిక సంస్థ రజతోత్సవంలో భాగంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన పలువురికి అవార్డులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు అడవి రాజు ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అతిథులు అవార్డులు ప్రదానం చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కళా సంస్థల ప్రతినిధులు వర్రె నాంచారయ్య, సన్ మూర్తి, రమణి, మహేష్ బాబు చేతుల మీదుగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన కొల్లూరు సత్యనారాయణ, తిరుపతి నాయుడు, గోపీనాయుడు, విజయరమణి, ఎం.శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, సిక్కోలు సత్యం, అఖిల, కావ్య, శంకరరావు తదితరులు అవార్డులు స్వీకరించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం, పి.ఎ.భాస్కర్, బైపల్లి సోమేష్, హేమసుందర్, శాస్త్రి, శివజ్యోతి, శారద, శర్మ తదితరులు పాల్గొన్నారు.

'మన్ కీ బాత్' వీక్షించిన బీజేపీ నాయకులు



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ లైవ్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌బాబు, జిల్లా కార్యదర్శి పద్మ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్, పార్టీ మండల అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు వీక్షించారు.

ఆదిత్య గణపతిగా దుర్గాగణపతి


సీతంపేటలో ఆదిత్య గణపతి అలంకరణలో దుర్గాగణపతి


మధురానగర్‌లో శివపూజ గణపతిగా విజయ గణపతి


మురళీనగర్‌లో గరిక పూసలతో పూజలందుకున్న గణపతి

సీతంపేట: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతంపేట కూడలిలో కొలువైన దుర్గా గణపతి ఐదో రోజు ఆదివారం ఆదిత్య గణపతి అలంకరణలో దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు. ఉదయం ఆలయంలో మహా గణపతి హోమం, స్వామికి మహాభిషేకం, సహస్ర నామార్చన, అలంకరణ జరిపారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు వివిధ నృత్య రీతుల్లో డ్యాన్సులు చేసి అలరించారు. సోమవారం శివబాల గణపతి అలంకారంలో దుర్గాగణపతి భక్తులకు దర్శనమిస్తారని ఈవో రమాభాయి తెలిపారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఉత్సవ సేవా కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శివపూజ గణపతిగా విజయ గణపతి

స్థానిక శంకరమఠం రోడ్ మధురానగర్‌లో కొలువైన విజయ గణపతి ఆలయంలో ఐదో రోజు ఆదివారం శివపూజ గణపతి అలంకారంలో స్వామి దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించి అభిషేకం, అర్చనలు చేశారు.

విజయ గణపతికి పంచామృతాభిషేకం

మురళీనగర్: మురళీనగర్ సెక్టార్-8లోని బాలభాను పాఠశాలలో కొలువైన విజయ గణపతికి ఆదివారం పంచామృతాభిషేకం నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం ప్రత్యేక పూజల అనంతరం పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కుంకుమ వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. లక్ష గరిక పూసలతో పూజించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్వీ శుభశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జగత్పూర్ పీఠం అకౌంటెంట్ గొల్లపూడి రవికుమార్ పాల్గొన్నారు. సిహెచ్.రమణారావు, గిరిజా రాణి, సిహెచ్.సూరప్ప నాయుడు, అరుణ దంపతులు పూజా సామగ్రిని సమకూర్చారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

దైవానుభూతికి సంగీతం ఒక సాధనం


కీర్తనలు ఆలపిస్తున్న సంగీత జనకులం విద్యార్థులు

తాటిచెట్లపాలెం: దైవానుభూతి పొందడమే శాస్త్రీయ సంగీత సాధనకు పరమావధి అని సంగీత జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ అన్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా తాటిచెట్లపాలెం మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లోని లక్ష్మీ గణపతి మందిరంలో సంగీత జనకులం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాస్త్రీయ సంగీతంలో సంస్కృతి సదన్‌లో ఇంద్రగంటి రమణీప్రసాద్ వద్ద శిక్షణ పొందుతున్న 30 మంది విద్యార్థులు వాగ్గేయకారులు రచించిన 12 కీర్తనలను వీనుల విందుగా గానం చేశారు. ముఖ్య అతిథి జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంగీత జనకులం అధినేత కులపతి ఐవీఎల్ శాస్త్రి సంగీత రంగంలో చేసిన సేవలను సత్యదేవ్ ప్రశంసించారు.

డ్రైవర్ల జీవనోపాధికి గండి


అక్కయ్యపాలెం హైవే కూడలి వద్ద నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోలు, వ్యాన్‌లు, జీపు డ్రైవర్ల ఉపాధికి గండి పడిందని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. ఫ్రీ బస్ పథకంలో ఆదాయం కోల్పోయిన డ్రైవర్లకు ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించాలని డిమాండ్ చేస్తూ అక్కయ్యపాలెం హైవే కూడలిలో ఆదివారం డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంధనం, నిత్యావసర సరకులు, వాహన విడి భాగాల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. దీనికి తోడు పెంచిన జరిమానాలు ఆటో డ్రైవర్లకు కునుకు లేకుండా చేస్తున్నాయని తెలిపారు. ఉబర్, ర్యాపిడోతో ఇప్పటికే 40 శాతం ఆటో డ్రైవర్లకు ఉపాధి పోయిందని, చంద్రబాబు ప్రభుత్వం పెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో మరో 30 శాతం నష్టపోయామన్నారు. ఆటో డ్రైవర్ల ఉపాధికి నష్టం కలిగించే ఉబర్, ర్యాపిడో అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించిన ఎన్నికల హామీని తక్షణం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రవికృష్ణ, కేలం శివ, కె.నూకరాజు, జి.నందీశ్వరరావు, శంకర్, సిహెచ్.శ్రీనివాసరావు, వి.సన్యాసిరావు, నర్సింగ్, ఈశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

గోపాలపట్నం హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ


గోపాలపట్నం: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 28 నుంచి 31 వరకు నెల్లూరు జిల్లాలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 10వ తరగతి విద్యార్థిని కీర్తన, 9వ తరగతి విద్యార్థినులు సంజన, దుర్గ, భవ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని హెచ్ఎం వై.స్వర్ణలత అభినందించారు.


పర్యావరణ సేవకులకు వృక్ష మిత్ర అవార్డులు



వృక్ష మిత్ర అవార్డులు అందుకున్న వారితో అతిథులు, ట్రస్టు ప్రతినిధులు

సీతంపేట: వృక్ష మిత్ర కన్నం శ్రీనివాసరావు 26వ వర్ధంతిని పురస్కరించుకుని పర్యావరణంపై పదేళ్లుగా సేవలందిస్తున్న వ్యక్తులు, విద్యార్థులకు వృక్షమిత్ర కన్నం శ్రీనివాసరావు మెమోరియల్ అవార్డులు ప్రదానం చేశారు. ద్వారకానగర్ గాయత్రి కళాశాల ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు కృష్ణ యూనివర్సిటీ పూర్వ వీసీ సుంకరి రామకృష్ణారావు, ఏయూ ఎన్విరాన్‌మెంటల్ విశ్రాంత ప్రొఫెసర్ రెడ్డి, ఎస్ఎంఎస్ డెంటల్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ మిత్ర, గాయత్రి కళాశాల ఇన్‌చార్జి ఆనంద్‌రావు అవార్డులు అందించారు. గాయత్రి విద్యా పరిషత్ ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి పర్యావరణ సేవలందిస్తున్న ఉత్తమ వలంటీర్లకు కన్నం శ్రీనివాసరావు మెమోరియల్ రికగ్నిజేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆర్గనైజేషన్ కేటగిరీ నుంచి ఎం.ఎస్.ఎన్.మూర్తి, ఇండివిడ్యువల్ కేటగిరీలో తోటపల్లి శ్యామ్‌కుమార్, ఏయూ రీసెర్చ్ స్కాలర్ కేటగిరీ నుంచి కె.ఎస్.స్వప్న, జీవీఎంసీ స్టూడెంట్ క్యాటగిరీలో బి.అనూష, ఏయూ ఎంఎస్సీ విద్యార్థి జె.సంజయ్ కుమార్‌లు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమాన్ని ట్రస్టు వ్యవస్థాపక కార్యదర్శి కన్నం వెంకటరమణా రావు పర్యవేక్షించారు.

వాడవాడలా అన్నదానాలు.. విశేష పూజలు


వరాహగిరి కాలనీలో అన్నదానం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు


51వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


49వ వార్డులో గణపతిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

తాటిచెట్లపాలెం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వాడవాడలా అన్నసమారాధనలు, విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. 45 వార్డు వరాహగిరి కాలనీ-2లో సుధా సర్కిల్ యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. సత్యసాయినగర్ కాలనీ అధ్యక్షుడు భరణి కాన రాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా వినాయకుడికి శివాలయం అర్చకుడు అంబటిపూడి సుధీర్‌శర్మ పూజలు చేశారు. కమిటీ సభ్యులు అప్పారావు, దివాకర్, వినాయక, కిషోర్, అశోక్, హరి తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. సోమవారం వినాయక నిమజ్జనం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

51వ వార్డులో ఘనంగా..

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో ఘనంగా జరుగుతున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రెయ్యి వెంకటరమణ పాల్గొంటున్నారు. గాంధీనగర్-2 యువసేన సేవా సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్నసంతర్పణను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మెట్ట దమయంతి, వరహాలరాజు, యువసేన సేవా సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- భీమ్‌నగర్‌లో ఆది ఆంధ్ర సేవా సంఘం యూత్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని రెయ్యి వెంకటరమణ చేతుల మీదుగా ప్రారంభించారు. సంఘ పెద్దలు, యూత్ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.
- శంకర్‌నగర్‌లో యంగ్ టైగర్ బాయ్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసంతర్పణలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొని భక్తులకు అన్నదానం వడ్డించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక మందిరాల సందర్శన


మురళీనగర్: మురళీనగర్ సమీపంలోని ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు పాల్గొన్నారు. బర్మా క్యాంప్ కృష్ణ మందిరం, బర్మా కాలనీ, అజయ్‌కలాం నగర్, సింగరాయిమెట్ట, బాలాజీనగర్ రాఘవేంద్ర టవర్స్ ప్రాంతాల్లోని వినాయక మందిరాలను సందర్శించి పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాలను శంకరరావు ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. వైఎస్సార్‌సీపీ 49, 50 వార్డుల అధ్యక్షులు అయినింటి రవికుమార్, లాలం వేణుగోపాల్, యూత్ అధ్యక్షుడు బి.శివరామప్రసాద్, జిల్లా విద్యా విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి.చైతన్య, వార్డు వాణిజ్య విభాగం అధ్యక్షుడు జి.రాంబాబు, వార్డు కమిటీ సభ్యులు అశోక్, కె.కిషోర్, సతీష్ పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞావంతుడు ఆరుద్ర


ఆరుద్ర శత జయంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఆచార్య బేతవోలు

సీతంపేట: అభ్యుదయ సాహిత్యంలో పరిచయం అవసరం లేని గొప్ప సాహితీమూర్తి ఆరుద్ర అని వక్తలు కొనియాడారు. ఆరుద్ర శత జయంతి సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆరుద్ర సాహిత్య దర్శనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ ఆరుద్ర గొప్ప పండితుడు, బహుముఖ ప్రజ్ఞావంతుడని, పద్యాలు, వ్యాసాలు, నాటికలు, సినిమా పాటలు, డిటెక్టివ్ నవలలు ఇలా ఎన్నో సాహిత్య ప్రక్రియలు చక్కగా నిర్వహించారన్నారు. ఆరుద్ర ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించే వారని, ఆయనను కలిసిన ప్రతి సారి ఒక కొత్త విషయాన్ని చెప్పేవారన్నారు. ఇటువంటి సాహిత్య కార్యక్రమాల వల్ల ఆరుద్ర వంటి మహోన్నత వ్యక్తికి న్యాయం చేసినట్టు అవుతుందన్నారు. ఆరుద్ర సినిమా పాటలు రాయడానికి ముందు మద్రాసులో మిలటరీ బ్యాండ్‌లో చేరారని, దానివల్ల మ్యూజిక్, ట్యూన్‌పై మంచి అవగాహన పెరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆరుద్ర సినీ సాహిత్యంపై రాంభట్ల నృసింహశర్మ రచించిన సమగ్రాంధ్ర సాహితీ సముద్ర ఆరుద్ర శత జయంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఆరుద్ర పాడిన పలు సినీ పాటలను రాంభట్ల ఆలపించి సభికులను అలరించారు. ఆరుద్ర ప్రముఖ రచనల్లో త్వమేవాహం పై ప్రయాగ సుబ్రహ్మణ్యం, సమగ్రాంధ్రా సాహిత్యంపై డి.రాంబాబు ప్రసంగించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు


క్షతగాత్రులు ఉదయ్, రాజేష్‌లకు సహాయం చేస్తున్న వాహన చోదకులు

అల్లిపురం: తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌పై ఆదివారం సాయంత్రం 4 గంటలకు ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం, పాత ఐటీఐ జంక్షన్‌కు చెందిన ఉదయ్ కార్పెంటర్‌గా, రాజేష్ మెకానిక్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. వీరు ఆదివారం మధ్యాహ్నం ఆర్కే బీచ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. సంపత్ వినాయక గుడి నుంచి రైల్వే స్టేషన్ వైపు వెళ్తుండగా డివైడర్‌ను గుద్దుకుని పడిపోయారు. వీరిలో ఉదయ్‌కు ముఖం, చెంపలపై తీవ్ర గాయాలయ్యాయి. రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు వారిని చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. వారిని ఒక ప్రైవేట్ కారులో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు క్షతగాత్రులను చికిత్స అందజేస్తున్నట్లు టూ టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీలక్ష్మి తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.